సమస్యలపై ప్రత్యేకాధికారికి వినతి



ప్రత్యేకాధికారిని కలిసిన మణికొండ మాజీ కౌన్సిలర్‌లు

మణికొండ: మున్సిపాలిటీ ప్రత్యేకాధికారిగా బాధ్యతలు తీసుకున్న జె.శ్రీనివాసరావును సోమవారం మణికొండ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్లు కె.రామకృష్ణారెడ్డి, వసంతరావు చౌహాన్ కలిశారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలో ప్రజలకు ఎదురయ్యే దైనందిన సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఆయా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కోరారు. నాయకులు బి.శ్రీరాములు, కుమార్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీ కొని వ్యక్తి మృతి

మణికొండ: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి మరణించాడు. నార్సింగి పోలీసుల సమాచారం మేరకు... కోకాపేట టోల్‌గేట్ నుంచి ఐఎస్‌బీ రోడ్డులో నడుచుకుంటూ వెళ్తున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనం వేగంగా వచ్చి ఢీ కొట్టింది. దాంతో అతని తలకు తీవ్ర గాయాలు కావటంతో చికిత్స నిమిత్తం అతన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతి చెందిన వ్యక్తి జీన్స్ పాయింట్, టీ షర్ట్ ధరించి తెల్లటి గడ్డం, మీసాలతో ఉన్నాడన్నారు. అతనికి సంబంధించిన వారు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

టోలిచౌకీ చౌరస్తా సుందరీకరణ పనులు షురూ



టైల్స్ వేస్తున్న సిబ్బంది

గోల్కొండ: టోలిచౌకీ చౌరస్తా సుందరీకరణ పనులు సోమవారం షురూ అయ్యాయి. టోలిచౌకీ చౌరస్తా సుందరీకరణ పనుల్లో భాగంగా గత నెలలోనే ఫ్లై ఓవర్ పిల్లలకు ఆకట్టుకునే, ఆలోచింపజేసే చిత్రాలు, రైటప్‌లు కూడా వేశారు. చౌరస్తా వద్ద గల ఆలయం ముందు నుంచి టైల్స్ వేసే పనులు కూడా ప్రారంభమయ్యాయి.

పోచమ్మ ఆలయ పునః నిర్మాణ పనులు ప్రారంభం



పూజల్లో కట్టా నాగేందర్, భుజేందర్ కుమార్, పవన్‌కుమార్

అబిడ్స్: గుడిమల్కాపూర్ ప్రాంతంలో 100 ఏళ్ల క్రితం నాటి పోచమ్మ ఆలయం పునఃనిర్మాణం పనులు ప్రారంభించారు. సోమవారం బీజేపీ సీనియర్ నాయకులు భుజేందర్‌కుమార్, పవన్ కుమార్ సహకారంతో ఆలయ పనులు ప్రారంభమయ్యాయి. గుడిమల్కాపూర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కట్టా నాగేందర్ ఆధ్వర్యంలో ఈ పనులు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణానికి సహకరిస్తున్నవారిని నాగేందర్ అభినందించారు.

దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం ఎక్కువ



అక్బరుద్దీన్‌తో మాట్లాడుతున్న మహ్మద్ జాహెద్

గోల్కొండ: దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం ఎక్కువ అని మజ్లిస్ శాసన సభా పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మహ్మద్ జాహెద్ సోమవారం అక్బరుద్దీన్ ఒవైసీని కలిశారు. ఈ సందర్భంగా తాను నిర్వహిస్తున్న టైలరింగ్ షాపు అభివృద్ధి చేసేందుకు అవసరమైన సహాయం ఇప్పించాలని ఆయన అక్బరుద్దీన్‌ను కోరారు. ఈ సందర్భంగా అక్బరుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ..దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. అంతేకాకుండా మజ్లిస్ పార్టీ దివ్యాంగులకు అండగా ఉంటూ సహాయ సహకారాలు అందిస్తుందన్నారు.

బండ్లగూడ జాగీర్‌లో ఆస్తి పన్ను... వసూళ్లపై ఫోకస్!

చెల్లింపునకు మిగిలిన గడువు 63 రోజులు మాత్రమే..

- 2023-24వ ఆర్థిక సంవత్సరానికి రూ. 20.29 కోట్లు వసూలు
- 2024-25లో రూ. 33.06 కోట్ల టార్గెట్
- ఇప్పటివరకు వసూలైంది రూ. 13.46 కోట్లు



బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆస్తి పన్ను వసూళ్లపై అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నారు. 63 రోజులలో వార్షిక సంవత్సరం ముగియనుండటంతో వంద శాతం టార్గెట్ చేరుకునేలా ప్రత్యేక దృష్టి సారించారు. శరవేగంగా బండ్లగూడ అభివృద్ధి చెందడంతో కార్పొరేషన్‌కు పన్నుల రూపంలో ఆదాయం భారీగా సమకూరుతోంది. సుదీర్ఘకాలం పాటు ఇంటి పన్ను చెల్లించని వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని కూడా ఈ సందర్భంగా అధికారులు హెచ్చరిస్తున్నారు.

- కార్పొరేషన్ పరిధిలో 2023-24వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ. 27.43 కోట్లు టార్గెట్ ఉంది. అప్పుడు రూ. 33,074కు పైగా నివాసాలకు అసెస్‌మెంటు చేసి ఉండగా, కొంత మంది సకాలంలో పన్ను చెల్లించకపోవడంతో అపరాధ రుసుము రూపంలో కలిపి మొత్తం ఆదాయం రూ. 20.29 కోట్లు వచ్చింది.
- 2024-25వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 35,806 నివాసాలకు అసెస్‌మెంటు చేయగా పాత బకాయిలతో కలిపి రూ. 33.06 కోట్ల టార్గెట్ నిర్దేశించారు. జనవరి నెల 27 వరకు రూ. 13.46 కోట్లు వసూలయ్యాయి. మిగిలిన బకాయిలను మార్చి నెలాఖరులోగా వసూలు చేసే దిశగా అధికారులు, బిల్ కలెక్టర్‌లు, కార్పొరేషన్ సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు కేవలం 63 రోజుల గడువు ఉండటంతో ఎలాగైనా వంద శాతం వసూలు చేయాలనే లక్ష్యంతో కార్పొరేషన్ సిబ్బంది ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. రెండు సంవత్సరాలుగా పన్నులు కట్టని వారిపై స్పెషల్ ఫోకస్ పెట్టారు. స్మార్ట్‌ఫోన్ ద్వారా ప్రభుత్వం రూపొందించిన వెబ్‌సైట్ నుంచి, మీ సేవ కేంద్రాల ద్వారా చెల్లించాలని తెలుపుతూ, వంద శాతం టార్గెట్‌కు చేరుకునేందుకు కృషి చేస్తున్నారు.

కార్పొరేషన్‌కు భారీగా ఆదాయం...

ఒకప్పుడు పన్నులు కట్టేందుకు ప్రజలు పెద్దగా ఆసక్తి చూపలేదు. అయితే కార్పొరేషన్‌గా మారిన అనంతరం... నిర్మాణాలు పూర్తి చేసిన ఇళ్లకు అసెస్‌మెంట్ పూర్తి చేయడంతో పాటు ఇంటి నెంబర్లు కేటాయించారు. దీంతో పన్నులు విధించడంతో కట్టేందుకు ముందుకొచ్చారు. ఈ నేపథ్యంలో కార్పొరేషన్‌కు ఆదాయం భారీగా పెరుగుతోంది.

బకాయిదారులపై చట్టపరమైన చర్యలు

మున్సిపల్ కార్పొరేషన్ పరిధి కిస్మత్‌పూర్, దర్గా ఖలీజ్ ఖాన్, హిమాయత్ సాగర్, హైదర్‌షాకోట్, బండ్లగూడ జాగీర్, పీరంచెరువు, గంధంగూడ, బైరాగి గూడలోని పలు కాలనీలలోని జనాభా 1.60 లక్షల ఉన్నట్టు అంచనా. 35,806 నివాస గృహాలు ఉండగా 200లకుపైగా కాలనీలు ఏర్పడ్డాయి. ఓటర్లు 87,202 మంది ఉన్నారు. అందులో పురుషులు 44,742 ఉండగా మహిళ ఓటర్లు 42,456 ఉండగా... ఇతరులు నలుగురు ఉన్నారు. బిల్ కలెక్టర్‌లు ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పిస్తుండటంతో ప్రజలు సైతం పన్నులు కట్టేందుకు ముందుకొస్తున్నారు. ఇంటిపన్ను చెల్లించని వారిపై కార్పొరేషన్ అధికారులు చర్యలు చేపట్టేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. పన్ను చెల్లించని వారిపై చట్టపరమైన చర్యలు తప్పవంటున్న అధికారులు.



బండ్లగూడ జాగీర్ నగర వ్యూ

పన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించండి..



ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించాలి. సక్రమంగా చెల్లిస్తేనే వ్యవస్థలో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టవచ్చు. కార్పొరేషన్‌లోని ప్రజలందరూ బాధ్యతగా భావించి సకాలంలో పన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించండి. మౌలిక సదుపాయాల రూపకల్పనకు, పట్టణ సమగ్ర అభివృద్ధికి అవసరమైన నిధులు సమకూర్చేందుకు ఆ నిధులతో సాధ్యం అవుతుంది. ప్రజలు చెల్లిస్తున్న ప్రతి రూపాయిని కార్పొరేషన్ అభివృద్ధి కోసమే ఖర్చు చేస్తాం.

– బచ్చలకూరి శరత్‌చంద్ర, కమిషనర్ బండ్లగూడ జాగీర్

బాధ్యతలు తీసుకున్న ప్రత్యేకాధికారులు



బండ్లగూడ ప్రత్యేకాధికారి శ్రీధర్‌ను సన్మానిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారిగా పి.శ్రీధర్ నియమితులైయ్యారు. హిమాయత్‌సాగర్‌లోని కార్యాలయంలో ఆయన బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్ చరంద్ర ఘనంగా స్వాగతం పలికారు. ప్రత్యేక అధికారి వివిధ సెక్షన్ల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో కమిషనర్ వివిధ సెక్షన్ల అధికారులను, సెక్షన్ అసిస్టెంట్లను, వార్డ్ అధికారులను, సిబ్బందిని ప్రత్యేక అధికారికి పరిచయం చేశారు. అనంతరం ప్రత్యేక అధికారి పి.శ్రీధర్ మాట్లాడుతూ... వివిధ వార్డులలో పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ట్రేడ్ లైసెన్స్‌ల జారీ, ఎల్‌ఆర్‌ఎస్ సర్వే, అడ్వర్‌టైస్మెంట్ పన్నుల వసూలు, ప్రాపర్టీ టాక్స్ కలెక్షన్, అండర్ అస్సెస్డ్ వసూలు, ఇంజినీరింగ్ విభాగంలో వివిధ వార్డులలో అభివృద్ధి పనుల్లో పురోగతి సాగించాలన్నారు. నూతన పనులు వనమహోత్సవంలో భాగంగా టార్గెట్స్ ప్రకారం నాటిన మొక్కల సంరక్షణ, నర్సరీ నిర్వహణ, రాబోవు సంవత్సరంలో టార్గెట్స్ ప్రకారం నర్సరీల పెంపు వివిధ వార్డులలో వీధి దీపాల నిర్వహణ, నూతన లైట్లు ఏర్పాటు, రిపైర్స్, భవన నిర్మాణ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు విడుదల, కోర్టు కేసులు, అకౌంట్ విభాగంలో బ్యాలెన్స్, చెల్లింపుల విషయాన్ని చర్చించారు. ఆడిట్ అభ్యంతరాలు, బ్యాంక్ లింకేజ్, ఇందిరా మహిళా శక్తి స్కీమ్, వివిధ టార్గెట్స్, నూతన సంఘాల ఏర్పాట్లపై సమీక్షించారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేస్తూ విధులు నిర్వహించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మణికొండ, నార్సింగిలలో...

మణికొండ: మున్సిపాలిటీలకు నియమించిన ప్రత్యేకాధికారులు సోమవారం మణికొండ, నార్సింగిలలో బాధ్యతలు తీసుకున్నారు. ప్రజా ప్రతినిధుల పాలన ముగియడంతో మున్సిపాలిటీలకు ప్రత్యేకాధికారులను నియమించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా మణికొండ మున్సిపాలిటీకి జె.శ్రీనివాస్‌రావు, నార్సింగి మున్సిపాలిటీ కార్యాలయంలో పి.శ్రీధర్‌లు బాధ్యతలు తీసుకున్నారు. మణికొండలో ప్రత్యేకాధికారి సిబ్బంది, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా వారికి అవసరమైన సౌకర్యాలను కల్పించే దిశగా వేగంగా పనులు కొనసాగాలని ఆదేశించారు. మణికొండలో కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్, మేనేజర్ శ్రీధర్, డీఈ శివసాయి, ఏఈ సంజయ్‌లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు. నార్సింగిలో మేనేజర్ యోగేశ్ పాల్గొన్నారు.



మణికొండ ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌రావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న కమిషనర్, మేనేజర్

యువత క్రీడల్లో రాణించాలి



వాలీబాల్ టోర్నీ విజేతలకు బహుమతులిస్తున్న కాంగ్రెస్ నేత ప్రేమ్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి: యువత క్రీడల్లో రాణించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ప్రేమ్‌గౌడ్ అన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మధుబన్ కాలనీలో వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ముగింపు కార్యక్రమం సోమవారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ప్రేమ్‌గౌడ్ టోర్నీ విన్నర్ జట్టు మధుబన్ టీమ్‌కు 5 వేలు, రన్నరప్ జట్టు అత్తాపూర్ టీమ్‌కు రూ. 3 వేల నగదు బహుమతులు, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్రీడలతో యువతలో క్రీడా స్ఫూర్తి పెంపొందుతుందన్నారు. మధుబన్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, యువజన సంఘం సభ్యులు మహేష్‌కుమార్, గోవింద్‌రాజ్, వెంకటేష్, విజయ్, నాని, కిషోర్, ఉదయ్, ఎం.సతీష్, చెంద్రయ్య, అర్జున్‌గౌడ్, కెప్టెన్ రమణగౌడ్, జావిద్, నిఖిల్, క్రీడాకారులు నాగు, ఉపేందర్, తరుణ్, గిరి, పాండు, ప్రవీణ్, ప్రతాప్, దుర్గ, శివ, రాము, చిన్న, బండారి రాజేష్, సుధ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో మూడు ఫిర్యాదులు



ఫిర్యాదులను స్వీకరిస్తున్న డీసీ రవికుమార్

రాజేంద్రనగర్: జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి మూడు ఫిర్యాదులు అందినట్లు ఉప కమిషనర్ రవికుమార్ తెలిపారు. రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగాలకు చెందిన ఒక్కో ఫిర్యాదు అందిందన్నారు. ఈ ఫిర్యాదులను ఆయా విభాగాలకు అందజేశామన్నారు. త్వరలో అధికారులు ఆయా ప్రాంతాలను సందర్శించి సమస్యలను పరిష్కరించనున్నట్లు వెల్లడించారు.

ఎమ్మార్పీఎస్ మంచిరేవుల కార్యవర్గం ఎన్నిక



అధ్యక్షుడికి నియామక పత్రం అందజేస్తున్న గణేష్

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ మంచిరేవుల ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. మండల ఇంచార్జి పి.గణేష్ మాదిగ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ఆర్.రజినీకాంత్ మాదిగ, ఉపాధ్యక్షులుగా జి.రత్నమాదిగ, ప్రధాన కార్యదర్శిగా డి.నరేష్‌మాదిగ, కార్యదర్శిగా కె. శ్రీకాంత్‌మాదిగ, కోశాధికారిగా ఎం. శ్రీకాంత్‌మాదిగ, అధికార ప్రతినిధిగా ఎ.నరసింహారావు మాదిగ, ప్రచార కార్యదర్శిగా డి.సత్యం మాదిగలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల ఇంచార్జి గణేష్‌మాదిగ మాట్లాడుతూ... మాదిగల ఏబీసీడీ వర్గీకరణకు మూడు దశాబ్దాల పాటు అలుపెరగని పోరాటం చేసిన మాదిగ జాతి ముద్దుబిడ్డ మంద కృష్ణ మాదిగ అన్నారు. వర్గీకరణను ముందుగా రాష్ట్రంలోనే అమలు చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ విషయాన్ని పట్టించుకోవటం లేదన్నారు. ఇందుకు నిరసనగా ఈ నెల 28వ తేదీన మహేశ్వరంలో లక్ష డప్పులు, వేల గొంతుల మహాప్రదర్శ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆ మహాప్రదర్శనకు పెద్ద ఎత్తున మాదిగలు తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

'స్కాలర్స్' టీచర్‌కు సావిత్రీబాయి పూలే అవార్డు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని స్కాలర్స్ ఇంటర్నేషనల్ స్కూల్ తెలుగు హెచ్‌ఓడీ చతుర్వేదుల దుర్గాదేవికి ప్రతిష్టాత్మక సావిత్రీబాయి పూలే జాతీయ అవార్డు లభించింది. దాంతో సోమవారం స్కూల్ ప్రిన్సిపాల్ శిల్పారెడ్డి, చైర్మన్ శ్రీధర్‌రెడ్డిలు ఆమెను అభినందించారు. విద్యారంగంలో విశిష్ట సేవలు అందించిన ఆమెను గుర్తించి సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్, టీచర్స్ ఆర్గనైజేషన్ సంస్థ ఇటీవల అవార్డును అందించటం గర్వకారణమని పలువురు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం స్కాలర్స్ స్కూల్ యాజమాన్యంతో పాటు వైస్ ప్రిన్సిపాల్ ఉషాతన్మయ్, తోటి ఉపాధ్యాయులు అభినందించారు. రాబోయే రోజుల్లో మరిన్ని ఉత్తమ అవార్డులను అందుకోవాలని ఆకాంక్షించారు.



దుర్గాదేవిని అభినందిస్తున్న స్కాలర్స్ ప్రిన్సిపాల్, చైర్మన్

అంతర్జాతీయ సెమినార్‌కు డాక్టర్ రవీందర్‌రెడ్డి

శంషాబాద్: నగరాల్లో వాతావరణ మార్పులు.. భవిష్యత్తు అవసరాల కోసం తీసుకోవాల్సిన సుస్థిరమైన విధానాలపై ఫిబ్రవరిలో సింగపూర్ వర్సిటీలో నిర్వహిస్తున్న సెమినార్‌లో పరిశోధన పత్రాలు సమర్పించే అరుదైన అవకాశాన్ని శంషాబాద్ (రాజేంద్రనగర్) డిగ్రీ కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకుడైన డాక్టర్ రవీందర్‌రెడ్డికి దక్కింది. ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామానికి చెందిన డాక్టర్ రవీందర్‌రెడ్డి కాకతీయ వర్సిటీ నుంచి అర్థశాస్త్రంలో పీజీ, ఆంధ్రా విశ్వవిద్యాలయంలో ఎంఈడీ, మహిళా సాధికారత మహిళా సంఘాలపై కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ చేశారు. వివిధ ప్రభుత్వ కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేసిన రవీందర్‌రెడ్డి ప్రస్తుతం శంషాబాద్ (రాజేంద్రనగర్) డిగ్రీ కళాశాలలో పని చేస్తున్నారు. ఆయనకు దక్కిన అరుదైన అవకాశంపై ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి, శంషాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.



డాక్టర్ రవీందర్‌రెడ్డి

'ఎగ్జిబిషన్'లో ఆధార్ కేంద్రం ప్రారంభం



ఆధార్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నిరంజన్, ఆదిత్య మార్గం

అఫ్జల్‌గంజ్: ఎగ్జిబిషన్ గాంధీ సెయింటనరీ కేంద్రంలో ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు కె.నిరంజన్, సీనియర్ సభ్యులు ఆదిత్య మార్గం సోమవారం ఆధార్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆధార్ కేంద్రం పని చేస్తుందన్నారు. ఈ నెల 30వ తేదీ లోపు ఆధార్ కేంద్రాన్ని సందర్శకులు ఎవరైనా వినియోగించుకోవాలని వారు సూచించారు.

పేద రెడ్డి కులస్తులకు చేయూతనిస్తాం

- మణికొండ రెడ్డి ఫౌండేషన్ అధ్యక్షుడు కె.నరేందర్‌రెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న రెడ్డి ఫౌండేషన్ నాయకులు

మణికొండ: రాబోయే రోజుల్లో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించటంతో పాటు పేద రెడ్డి కులస్తులను అన్ని విధాలా ఆదుకునేందుకు మణికొండ రెడ్డి ఫౌండేషన్ కృషి చేస్తుందని ఫౌండేషన్ అధ్యక్షుడు కె.నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం రెడ్డి ఫౌండేషన్ రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను మణికొండ పంచవటి కాలనీలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇప్పటికే రెడ్డి ఫౌండేషన్ తరఫున పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం, ఆరోగ్య సమస్యలకు పరిష్కారాలు, వివాహ వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో తమ సేవా కార్యక్రమాలను మరింతం చేస్తామని ఆయన పేర్కొన్నారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ కె.రామకృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు బి.ఉపేంద్రనాథ్‌రెడ్డి, రెడ్డి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి కె.శ్రీకాంత్‌రెడ్డి, కోశాధికారి ఎ.శ్రీపతిరెడ్డి, నాయకులు ఎస్.రామసుబ్బారెడ్డి, సురేష్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వెంకటరమణరెడ్డి, కిషన్‌రెడ్డి, బ్రహ్మారెడ్డి, కృపాకర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, గణేష్‌రెడ్డి, స్వాతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి టెన్త్ విద్యార్థులకు అల్పాహారం



హెచ్‌ఎంను కలిసిన ట్రస్ట్ నిర్వాహకులు, దాతలు

మణికొండ: పదవ తరగతి ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న విద్యార్థులకు సాయంత్రం సమయంలో అల్పాహారం అందించేందుకు మణికొండలోని వీఆర్-4 సహాయోగ్ చారిటబుల్ ట్రస్ట్ ముందుకొచ్చింది. మణికొండ మున్సిపాలిటీ కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 160 మంది విద్యార్థులు పదవ తరగతి చదువుతున్నారు. మధ్యాహ్న భోజనం పాఠశాలలో పెడుతున్నా ప్రత్యేక తరగతుల కారణంగా సాయంత్రం 6 గంటల వరకు వారు పాఠశాలలోనే ఉండాల్సి వస్తున్నది. దాంతో వారు ఆకలితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నీ విషయాన్ని మాజీ కౌన్సిలర్ కె.రామకృష్ణారెడ్డి ట్రస్ట్ నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన వారు మంగళవారం నుంచి ప్రతి రోజూ సాయంత్రం విద్యార్థులకు స్నాక్స్ అందించేందుకు అంగీకరించారు. ఈ విషయాన్ని సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నిరంజన్‌ను కలిసి తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ మేనేజర్ ఎ.లక్ష్మణ్ రావు, కోశాధికారి దిలీప్‌కక్కడ్, దాతలు సుబ్రమణ్యం, నరసింహం, మురళీరావు, మస్తాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను సత్వరమే పూర్తిచేయండి

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి పనులు ఆగిపోయాయని.. ఆయా పనులను సత్వరమే పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని మాజీ వైస్ చైర్మన్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కె.నరేందర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు మణికొండ మున్సిపల్ ప్రత్యేకాధికారి జె.శ్రీనివాసరావును సోమ వారం కలిసి విజ్ఞప్తి చేశారు. మున్సిపాలిటీ నూ తన కార్యాలయం, క్రీడామైదానం, మణి కొండ గ్రామ కమ్యూనిటీ హాల్ తదితర పనులు మధ్యలో ఉన్నాయని వివరించారు. వాటికి ఇటీవల జరిగిన మున్సిపల్ సమావేశంలో నిధులను కేటాయిస్తూ తీర్మానం సైతం చేశామన్నారు. వాటిని సకాలంలో పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు బి.రవికాంత్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు జె.సిద్దప్ప, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగుల కృషితోనే విద్యారంగం అభివృద్ధి

అబిడ్స్: ఉద్యోగుల కృషితోనే విద్యారంగం అభివృద్ధి చెందుతుందని హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.రోహిణి పేర్కొన్నారు. ఉద్యోగులందరూ క్రమశిక్షణతో కృషి చేస్తున్నందున విద్యారంగం ముందుకు వెళ్తుందన్నారు. హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ కార్యాలయాల్లో పనిచేసే విజయలక్ష్మి, సుగుణారెడ్డి, జయంతిరెడ్డి, ఫయాజ్, ముక్తదర్, మహ్మద్ ముజాహిద్ అలీ, దేవిప్రసాద్, రమేష్, పవన్, పరమేష్‌లకు ఆమె ఉత్తమ అవార్డులు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా రోహిణి మాట్లాడుతూ..ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. రజిత, ప్రవీణ, రాణి, ప్రవీణ్, కేఆర్.రాజ్‌కుమార్, భాస్కర్ పాల్గొన్నారు.